ఊరూరా బెల్టు దందా

కూటమి ప్రభుత్వంలో మద్యం బెల్టుషాపుల దందా అడ్డూ అదుపూ లేకుండా యథేచ్ఛగా సాగుతోంది. టీడీపీ నాయకుల ధనదాహాన్ని తీర్చేందుకు ఊరూ వాడా అనధికారిక మద్యం దుకాణాలు తెరిచి పల్లెపల్లెకూ మద్యాన్ని అందుబాటులోకి తెచ్చి వ్యాపారులు జేబులు నింపుకుంటూ జనం జీవితాలను గుల్లచేస్తున్నారు. మామూళ్లకు అలవాటుపడిన ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తూ మిన్నకుండిపోతుండటంతో బెల్టుషాపుల వ్యాపారం మూడు క్వార్టర్లు, ఆరు పుల్లులు అన్నట్లుగా సాగిపోతోంది.

- మామూళ్ల మత్తులో పచ్చ నేతలు, అధికారులు
- చిత్తయిపోతున్న మధ్య తరగతి కుటుంబాలు
- రాములోరి పేరుతో గ్రామాల్లో వేలం పాటలు
- వీరభద్రాపురం పంచాయతీని రూ.30.20 లక్షలకు పాడుకున్న వైనం
- ఎమ్మార్పీ కంటే రూ.50 నుంచి రూ.100 అదనం
- నియోజకవర్గంలో పెచ్చరిల్లుతున్న లిక్కర్ మాఫియా


యర్రగొండపాలెంలో బార్అండ్ రెస్టారెంట్గా వెలుగొందుతున్న మద్యం షాపు

యర్రగొండపాలెం:

నియోజకవర్గంలో మద్యం బెల్ట్ షాపులేని గ్రామం అంటూ లేదు. ఎక్కడ పడితే అక్కడ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణం, మండల కేంద్రాల్లో డోర్ డెలివరీ కూడా అందుబాటులో ఉంది. ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాలు దేదీప్యమానంగా బార్ అండ్ రెస్టారెంట్లుగా వెలుగొందుతున్నాయి. లిక్కర్ బెల్ట్ షాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖాధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలేందుకు సంవత్సరానికి రూ.6 లక్షలు వసూలు చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. నియోజకవర్గ స్థాయికి చెందిన ఒక టీడీపీ నాయకుడికి జీతం ఇచ్చినట్లు సంవత్సరానికి రూ.72 లక్షలు షాపు యజమానులు ముట్టచెప్తున్నట్లు సమాచారం. ఈ మామూళ్లను తట్టుకోవడానికి వారు తమ లిక్కర్ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. ప్రతి గ్రామానికి రెండు, మూడు ప్రకారం బెల్ట్ షాపులు నిర్వహించుకుని మద్యం అమ్మకాలు పెంచుకుంటున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల కోసం టీడీపీ వర్గీయులు పోటీ పడుతుండటంతో అక్కడి నాయకులు రాములోరి పేరుతో వేలం పాటలు నిర్వహించి ఎక్కువ పాట పాడిన వారికి ఆ బెల్ట్ షాపు అప్పచెప్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం పంచాయతీని రూ.30.20 లక్షలకు పాడుకున్నారంటే లిక్కర్ వ్యాపారం ఏ మేరకు జరుగుతుందో ఇట్టే అర్థమవుతుంది.

నియోజకవర్గంలో మొత్తం పంచాయతీలు 94, గ్రామాలు 213, అధికారిక లిక్కర్ షాపులు 20, బెల్ట్ షాపులు 233 ఉన్నాయి. మద్యం బెల్ట్ షాపుల దాడులు నిర్వహించకుండా వ్యాపారం ముమ్మరంగా కొనసాగాలంటే ఎక్సైజ్ అధికారులకు షాపునకు రూ.25 వేల ప్రకారం నియోజకవర్గంలోని 20 షాపుల యజమానులు నెలకు రూ.5 లక్షల ప్రకారం అందజేస్తున్నట్లు సమాచారం. బెల్ట్ షాపుల నిర్వహణకు అండగా ఉండేందుకు టీడీపీ నాయకుడికి ఒక్కొక్క షాపునకు నెలకు రూ.30 వేల ప్రకారం 20 షాపులకు కలిపి రూ.6 లక్షలు అందజేయాల్సి ఉంటుందని అంటున్నారు. ఊరూరా బెల్ట్ షాపులు ప్రారంభించటానికి పోటీ పడే తెలుగు తమ్ముళ్ల కోసం ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకులు బంపర్ ఆఫర్ ఇచ్చారు. కొన్ని గ్రామాల్లో గ్రామ రాశిగా, మరి కొన్ని గ్రామాల్లో రాములోరి పేర్లతో వేలం పాటలు నిర్వహించి ఒక్కొక్క బెల్ట్ షాపును రూ.1 లక్ష నుంచి రూ.30 లక్షల వరకు పాడేసుకున్నారు. పంచాయతీ కేంద్రమైన వీరభద్రాపురం బెల్ట్ షాపు రూ.19.70 లక్షలు, ఆ పంచాయతీ పరిధిలోని ఎల్లారెడ్డిపల్లెలో షాపు నిర్వహణకు రూ.7.50 లక్షలు, అక్కడి ఎస్సీపాలెంలో మద్యం అమ్ముకోవటానికి రూ.1 లక్ష, గడ్డమీది పల్లె గ్రామంలో షాపు పెట్టుకోవటానికి రూ.2 లక్షల ప్రకారం ఆ పంచాయతీలో మొత్తం రూ.30.20 లక్షలకు వేలం పాడుకున్నారు. త్రిపురాంతకం మండలంలోని మిట్టపాలెంలో బెల్ట్ షాపు కోసం టీడీపీలో ఉన్న ఇరువర్గాల వారు బాహాబాహీకి దిగారు. గాయాలతో ప్రభుత్వ వైద్యశాలలో చేరి కేసులు కూడా పెట్టుకున్నారు. ఒక వర్గానికి కూటమి నాయకుడు గూడూరి ఎరిక్షన్బాబు, మరో వర్గానికి టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మన్నె రవీంద్ర మద్దతు పలికారు. త్రిపురాంతకంలో షాపు అద్దె రూ.25 వేలు అయితే దాని ఎదురుగా బడ్డీ కొట్టు నిర్వహించుకోవటానికి రూ.50 వేలు వసూలు చేస్తున్నారు. పెద్దారవీడు మండలంలోని కుంట వద్ద ప్రతి గురువారం గొర్రెల సంత జరుగుతుంటుంది. ఆ రోజు అక్కడ ప్రతి సెంటర్లో మద్యం ఏరులై పారుతుంది.

గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ ఇలా..

మండలం	పంచాయతీలు	గ్రామాలు	షాపులు	బెల్ట్ షాపులు
యర్రగొండపాలెం	18	48	5	40
పుల్లలచెరువు	19	38	4	40
త్రిపురాంతకం	24	45	5	60
పెద్దారవీడు	19	35	3	28
పెద్దదోర్నాల	14	47	3	65
మొత్తం	94	213	20	233

క్లుప్తంగా

దర్శిలో మోస్తరు వర్షం

దర్శి: దర్శిలో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి తెరపి లేకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షంతో పొలాలు పదునెక్కే అవకాశం ఉందని రైతులు హర్షం చేశారు. రైతులు దుక్కులు దున్నుకునే పనిలో నిమజ్ఞమయ్యారు.

తోడికోడలు దాడిపై కేసు నమోదు

ముండ్లమూరు(దర్శి): తోడికోడలు దాడి చేసిందని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మందలపు భారతి, మందలపు లక్ష్మి తోడికోడళ్లు. తన ఇంటి వద్ద గేదె పాలు పితుకుతున్న భారతిపై లక్ష్మి, ఆమె బంధువులు కలిసి కళ్లలో కారం కొట్టి గొడ్డలితో దాడి చేశారు. క్షతగాత్రురాలిని అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిద్దరికీ సుమారు నాలుగేళ్లుగా మాటలు లేవని, భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వైభవంగా పీర్ల నిమజ్జనం

బేస్తవారిపేట: మండలంలోని శింగరపల్లె, మోక్షగుండంలో మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద షహాదత్ సందర్భంగా పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అగ్ని గుండం ఏర్పాటు చేసి పీర్ల ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపుగా గ్రామ శివారులో జల్దికి తరలించారు.

శాలివాహన సత్రం అధ్యక్షుడిగా మోహన్రావు

మార్కాపురం టౌన్: శ్రీశైలం శాలివాహన అన్నదానసత్రం నూతన అధ్యక్షుడిగా మార్కాపురం పట్టణానికి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాసులు సోదరుడు మోహన్రావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో మోహన్రావును సత్రం అధ్యక్షునిగా నియమించారు. ఆయనను శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య తదితరులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ


వీరారెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు

కురిచేడు: మండలంలోని పడమర గంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తుపాకుల వీరారెడ్డిని ఆదివారం ఆ పార్టీ మండల నాయకులు పరామర్శించారు. అనారోగ్యానికి గురైన వీరారెడ్డి వైద్య చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్రెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదేశాల మేరకు కురిచేడు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు సారెడ్డి నాగిరెడ్డి, అంకె గోపాలకృష్ణ సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్ కుమార్, అన్నెంయోగి సుబ్బారెడ్డి తదితరులు వీరారెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కోటసత్యమాంబదేవికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

అర్థవీడు: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లిలో పోలేరమ్మ తల్లికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. వర్షాలు కురిసి పాడి పంటలు సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ భక్తులు అమ్మవారికి 101 ప్రదర్శనలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

శాకంబరిగా అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్కుమార్ శర్మ పుష్పాలు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. పలువురు భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అమ్మవారిని పలురకాల కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు.

కూటమి ప్రభుత్వంపై కొండంత వ్యతిరేకత

- బాబు మోసాన్ని ఎండగట్టేందుకు వచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రామాల నుంచి భారీ ఎత్తున అభిమానులు తరలిరావడాన్ని చూస్తుంటే కూటమి ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వ మనుగడ ఎన్నో రోజులు సాగదన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందా అని ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి వచ్చిన వారందరూ తమ గ్రామాల్లో చంద్రబాబు చేసిన, చేస్తున్న మోసాల గురించి వివరించాలని, ఓట్ల కోసం బాబు ష్యూరిటీ బాండ్లలో ఉన్న క్యూ ఆర్ కోడ్ గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలనికోరారు. పూర్తిగా వెనకబడిన ప్రాంతమైన యర్రగొండపాలెంలో జరిగిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, దర్శి ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంటు పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆరె శ్యామల, యనమల నాగార్జున యాదవ్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఓబులరెడ్డి, మండల కన్వీనర్ ఏకుల మునలారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.అరుణాబాయి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జానకి రఘు, వైస్ ఎంపీపీ ఎల్.రాములు, ఎస్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్లు తమ్మినేని సత్యనారాయణరెడ్డి, ఆవుల కోటిరెడ్డి, ఎ.రమణారెడ్డి, రోషిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, కందూరి కాశీవిశ్వనాథ్, దోగిపర్తి సతీష్ పాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశాల పేరుతో పాఠశాలలకు సెలవు

- గతంలో కాంప్లెక్స్ సమావేశాలు.. నేడు క్లస్టర్ సమావేశాలు
- అప్పట్లో పాఠశాలల నిర్వహణతో పాటు కాంప్లెక్స్ సమావేశాలు
- నేడు దానికి విడ్డూరంగా పాఠశాలలకు ఒక పూట సెలవు
- కుంటుపడుతున్న విద్యాబోధన



మూసి ఉన్న కురిచేడు జెడ్పీ బాలికల పాఠశాల

కురిచేడు:

అసలే ఉపాధ్యాయుల కొరత, ఆపై పుస్తకాల కొరత.. దానికి తోడు కాంప్లెక్సుల పేరుతో పాఠశాలలకు తరుచూ సెలవులు ప్రకటించడంతో విద్యార్థులకు విద్యాబోధన కుంటుపడుతోంది. ఒక వైపు విద్యావ్యవస్థలో చేసిన మార్పులతో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు రాక అరకొర విద్యార్థులతో నిర్వహిస్తున్న పాఠశాలల్లో ఇలాంటి సెలవులు ప్రకటిస్తుండటంతో విద్యాబోధన ఎలా జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్వహించి ప్రైవేటు పాఠశాలల నుంచి కూడా ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వచ్చారు. నేడు దానికి భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లి ప్రైవేటు పాఠశాలలకు వెళ్తుండటంపై ఒక వైపు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో లభించిన నాణ్యమైన విద్యాబోధన నేడు లభించటం లేదని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధానం కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల మనుగడ రాబోవు రోజుల్లో కష్టతరమవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు పునరాలోచించి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా అమ్మవారికి ఆషాఢమాసం పూజలు


అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన మహిళా భక్తులు


పెద్దదోర్నాలలో ఊరేగింపుగా వస్తున్న మహిళా భక్తులు

- పసుపు, కుంకుమలతో చీర, సారెలను సమర్పించిన మహిళా భక్తులు

పెద్దదోర్నాల: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో పాటు చీరె, సారెలను సమర్పించుకున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్ను పసిడి, రజిత ఆభరణాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5 గంటలకు అమ్మవారికి సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులచే అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, మహా మంగళ హారతి, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఒడి బియ్యంతో పాటు అమ్మవారికి పలు రకాల నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళా భకులు తొలుత మండల కేంద్రంలోని వీధుల గుండా మేళ తాళాల నడుమ ఊరేగింపు నిర్వహించి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు.

ఎల్లమ్మ దేవరకు మొక్కులు తీర్చుకున్న భక్తులు


యల్లమ్మదేవరకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో వేంచేసి ఉన్న యల్లమ్మ దేవరకు ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. యల్లమ్మదేవర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి ఆషాఢమాసంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి అమ్మవారి మూల విగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగ శిలలు, మల్లికార్జున స్వామివారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

సమ్మె చేస్తున్నా స్పందించరా?

- గిద్దలూరులో కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

గిద్దలూరు రూరల్: సమస్యల పరిష్కారం కోసం గత 5 రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని మున్సిపల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం వేతనం చెల్లించాలని, కేటగిరీ వైజ్గా కార్మికులందరికి వేతనాలు చెల్లించాలని, రిటైరైన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. సమస్యల సాధన కోసం ఐకమత్యంతో పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు మురళి, చంటియ్య, బాలయ్య, రంగయ్య, పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని కమిషనర్ డీవీ నారాయణరావు హెచ్చరించారు. మార్కాపురంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ఈనెల 16న 'సాక్షి'లో 'కవర్ కే పవర్.. హెచ్చరికలు బేఖాతర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్, నిత్యావసర సరుకుల దుకాణాలను తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. పేపర్ బ్యాగులు, జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు వాడాలని సూచించారు.